## క్లుప్తంగా

### ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

**నర్మెట:** మండలంలోని దొంగలచెలిమి తండాకు చెందిన కుర్రా బాలి వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. కాగా, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహయంతో మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్ఓసీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దూడల సిద్దయ్య, చెవుల పరశురాములు యాదవ్, రాజ్‌కుమార్, జయ మల్లేష్, మధు, అంజయ్య, రాజశేఖర్, రామకృష్ణ, బోజ్యానాయక్ పాల్గొన్నారు.

### అన్నదాత నిజాయితీ



తప్పిపోయి వచ్చిన గేదెను కట్టేసిన రైతు

**దేవరుప్పుల:** తులం బంగారం ధర మాదిరి పాలు ఇచ్చే పాడిగేదె కోనాలన్న లక్ష రూపాయల డిమాండ్ ఉన్న తరుణంలో తప్పిపోయి వచ్చిన రెండు గేదెల ఆచూకి తెలిపేలా కష్టం తెలిసిన ఓ అన్నదాత సోషల్ మీడియాలో సమాచారం ఇస్తూ తన నిజాయితీ నిరూపించుకున్నారు. వివరాళ్లోకెళ్తే.. కామారెడ్డిగూడేనికి చెందిన మచ్చ యాకయ్య వ్యవసాయ బావి వద్దకు ఆదివారం రెండు గేదెలు తప్పిపోయి వచ్చాయి. వాటి పోకడను గమనించిన సదరు రైతు మేత వేసి కట్టేశారు. వాటి ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టి బాధిత రైతులు ఉంటే 990837116 సెల్‌ఫోన్‌ను సంప్రదించాలన్నారు. పూర్వం ఊరూరా తప్పిపోయి వచ్చిన మూగజీవాలకు బంజర దొడ్డిలు ఆశ్రయం ఇచ్చేలా ఉండేవి. మరునాడు పరిసరాల గ్రామాలకు సమాచారం అందించేవారు. ఐతే గత పదిహేను ఏళ్ల నుంచి అభివృద్ధి పేరిట ఆ స్థలాలు కనుమరుగవడంతో ఇలాంటి సోషల్ మీడియా వేదికగా మారడం గమనార్హం.

### మండల హెచ్‌ఎంల కమిటీ ఎన్నిక

**నర్మెట:** మండల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా దూడల రమేష్, ప్రధాన కార్యదర్శిగా బండారి యాకయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు గౌరవ అధ్యక్షుడిగా పాతూరి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మి, కార్యదర్శిగా యాదగిరిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**జనగామ మండల కమిటీ..**

**జనగామ రూరల్:** మండలంలో పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల సమావేశం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ధర్మకంచ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల మురళి ఆధ్వర్యంలో మండల హెచ్‌ఎంల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బానోత్ శంకర్, అధ్యక్షుడిగా మరియాల రమేష్, ఉపాధ్యక్షురాలుగా కొర్ల పాటి వినోద, ప్రధాన కార్యదర్శిగా బుదారపు గణేష్, ట్రెజరర్‌గా చాట్ల అరుణ, సంయుక్త కార్యదర్శిగా దోర్న జయశ్రీ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు కె.సురేందర్ రెడ్డి, ఎం.యమునా రాణి పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీకి గోడువెలిబుచ్చకున్న కాంగ్రెస్ అసంతృప్తి నాయకులు

**దేవరుప్పుల:** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ అమీర్‌అలీ ఖాన్‌కు మండల అసంతృప్తి కాంగ్రెస్ నాయకులు తమ గోడు వెలిబుచ్చుకున్నారు. ఆదివారం మండల కేంద్రం నుంచి పాలకుర్తికి వెళ్తున్న అమీర్‌అలీఖాన్‌ను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్, సీనియర్ నాయకుడు తోటకూరి రమేష్‌లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు అసెంబ్లీ ఎన్నికల వరకు కీలకంగా పనిచేసిన పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తిని అకారణంగా తొలగించడమేగాక, ఆయన నాయకత్వంలో పనిచేసిన పార్టీ శ్రేణులను దూరంగా పెట్టి దినదినం పార్టీకి దూరం చేస్తున్నారని వాపోయారు. ఎమ్మెల్యేగా గెలిపించిన క్యాడర్‌ను పక్కకుబెట్టి కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ఎమ్మెల్సీ స్పందిస్తూ ఏదైనా లిఖిత పూర్వకంగా ఇస్తే తాము అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని సూచించారు. గొడిశాల శ్రీనివాస్, కారు పోతుల యాకస్వామి, నరేష్, బట్ట అబ్బయ్య, మండల యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల అనిల్ కుమార్, ఆకుల సంతోష్, పత్తే పురపు శేఖర్, తోటకూరి మహేష్ తదితరులు ఉన్నారు.

# శిథిలావస్థలో డబుల్‌బెడ్రూం ఇళ్లు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



శిథిలావస్థకు చేరిన డబుల్‌బెడ్రూం ఇళ్లు



ఇంటిస్లాబ్‌పై ఖాళీ మద్యం సీసాలు

**స్టేషన్‌ఘన్‌పూర్:** గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకంలో భాగంగా మండలంలోని సముద్రాల గ్రామంలో నిర్మాణం చేపట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరి బూత్‌బంగ్లాలను తలపిస్తున్నాయి. సదరు డబుల్‌బెడ్రూం ఇళ్ల చుట్టూరా కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరగా మందుబాబులకు అడ్డాగా మారి అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పథకంలో భాగంగా సముద్రాల గ్రామానికి 40 ఇళ్లు మంజూరు చేశారు. అందుకు గాను రూ.2.16కోట్ల అంచనావిలువతో 2018 ఆగస్టు 31న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శంకుస్థాపన చేశారు. కాగా అందులో కాంట్రాక్టర్ కేవలం పదిహేను ఇళ్లను మాత్రమే నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారులను గ్రామసభలో ఎంపిక చేయాల్సి ఉండగా పలు రాజకీయ కారణాలతో జాప్యం చేశారు. కాగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ సైతం ఇళ్ల నిర్మాణం తూతూమంత్రంగా చేపట్టి మధ్యలోనే మమ అనిపించారు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో డబుల్‌బెడ్రూం ఇళ్ల విషయాన్ని పట్టించుకునేవారు లేకుండా పోయారు.

**మందుబాబులకు అడ్డా..**

సముద్రాలలోని డబుల్‌బెడ్రూం ఇళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి మందుబాబులకు అడ్డాగా మారింది. కాంట్రాక్టర్ అటుఇటుగా నిర్మాణం చేపట్టిన పట్టుమని పది ఇండ్ల చుట్టూరా పెద్ద ఎత్తున కంపచెట్లు పెరిగి బూత్‌బంగ్లాలుగా మారాయి. డబుల్‌బెడ్రూం ఇళ్ల స్లాబ్ పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరాయి. గ్రామానికి దూరంగా నిర్మానుష్య ప్రదేశంలో ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, శిథిలావస్థకు చేరుతున్న డబుల్‌బెడ్రూం ఇళ్లకు మరమ్మత్తు చేయించి అర్హులైన పేదలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

# నేలను తాకిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ వైరు



నేలను తాకుతున్న ఫ్లడ్ లైట్ విద్యుత్ వైర్



ఫ్లడ్ లైట్

**జనగామ:** పట్టణంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా డివైడర్‌పై మొదటి ఫ్లడ్ లైట్ విద్యుత్ వైర్ ఊడి నెలను తాకుతోంది. గాలి దుమారంతో అటూ ఇటూ ఊగుతూ రాపిడికి గురికావడంతో ఆదివారం చిన్న మంటలు సైతం చెలరేగాయి. అక్కడే ఉన్న పలువురు అప్రమత్తం కావడంతో అటు వైపు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వానాకాలం సీజన్ ప్రారంభం, ఎన్నడూ లేని విధంగా ఈదురు గాలులు ఉండడంతో విద్యుత్ సర్వీసు వైర్లు, ఇతర కేబుళ్లు ఎలా ఉన్నాయనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ముగిసిన దుర్గామాత ఉత్సవాలు



దుర్గామాతకు బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

**రఘునాథపల్లి:** బానాజీపేటలో మూడు రోజుల పాటు నిర్వహించిన బొడ్రాయి, దుర్గామాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శనివారం అర్ధరాత్రి దాటాక దుర్గామాతకు గ్రామస్తులు ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా బయలు దేరారు. గ్రామంలోని బొడ్రాయి వద్దకు బోనాలతో చేరుకున్నారు. అక్కడి నుంచి శివసత్తుల పూనకాలతో దుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. తెల్లవారే దాక ఆలయం వద్ద డుబ్బులోళ్లు చెప్పిన కథలకు భక్తులు ముగ్ధులయ్యారు. ఆదివారం ఉదయాన్నే డుబ్బులోళ్లు ఆలయం వద్ద గావు పట్టడంతో గ్రామస్తులు కోళ్లు, యాటలు బలిచ్చారు. మధ్యాహ్నం దుర్గామాతకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు చల్లంగా ఉండాలని దేవతను వేడుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు దుర్గామాతను దర్శించుకున్నారు.

# ఏడాదిన్నరలోపే రూ.2.41కోట్ల కల్యాణలక్ష్మి చెక్కులు



కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**లింగాలఘణపురం:** ఏడాదిన్నర కాలంలోనే కేవలం లింగాలఘణపురం మండలంలో 241 మందికి రూ.2.41 కోట్ల చెక్కులను అందించామని, ఆడబిడ్డల పెళ్లికి చేయూత ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులో ఉన్నప్పటికి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పథకం రాజీవ్ యువ వికాసంతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరుగకుండా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా 40 మందికి కల్యాణలక్ష్మి, 18 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రవీందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, మాజీ జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, మార్కెట్ డైరెక్టర్ మోహన్ పాల్గొన్నారు.

**దళితులకు అన్యాయం జరగనివ్వం**

తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ఏ ఒక్క దళిత బిడ్డకు అన్యాయం జరుగనివ్వనని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నేలపోగుల ఎంపీటీసీ నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వారసులుగా కష్టపడి ఎదిగి ఆత్మగౌరవంతో బతుకాలని అన్నారు. నాడు అంబేద్కర్ లేకుంటే మనందరం ఏమైపోయే వాళ్లమోనని, తాను ఎమ్మెల్యేగా ఉన్నానంటే ఆయన వల్లేనని అన్నారు. నేడు రాజ్యాంగాన్ని మార్చాలని కొన్ని పార్టీలు చూస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షించేదొక్కటేనని అన్నారు. నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరైతే 1500 ఇళ్లు దళితులకే కేటాయించామని, రాజీవ్ యువ వికాసంలో మండలానికి 640 యూనిట్లు మంజూరయ్యాయని, పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నర్సింగ రమేష్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణ, కిష్టయ్య, సుగుణ, సోమనర్సయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

**జనగామ రూరల్:** ఈనెల 27వ తేదీన జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మినీ స్టేడియం, ధర్మకంచలో ఈ ఎంపికలు ఉంటాయని, 8, 10, 12 సంవత్సరాల లోపు బాల బాలికలు అర్హులన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు జూన్ 1న జింఖానా గ్రౌండ్‌లో 11వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు జనన ధృవీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు గంగిశెట్టి మనోజ్ కుమార్(9885046437), ఆవుల అశోక్ (9912453220), వంచ చంద్రశేఖర్ రెడ్డి (7799552233), రంజిత్ (9985223047)లను సంప్రదించాలన్నారు.

### నిత్యావసరాల పంపిణీ

**దేవరుప్పుల:** సీతారాంపురం అనాథ శరణాలయంలో బెస్ట్ ఫ్రెండ్‌సొసైటీ కార్యదర్శి పసునూరి సురేష్–మాధవి దంపతుల కుమార్తె శాన్వి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని వృద్ధులకు రూ.5 వేల వ్యయంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, సభ్యులు పసునూరి అరుణ్ గోపాల్, ఆనంతోజు కాశీనాథం, శరణాలయ నిర్వహకుల బ్రహ్మచారీ పాల్గొన్నారు.

# స్వేరోస్ విక్టరీ డే వేడుకలు



వేడుకల్లో స్వేరోస్ నాయకులు

**లింగాలఘణపురం:** మండల కేంద్రంలో ఆదివారం స్వేరో విక్టరీ డే వేడుకలను స్వేరో జిల్లా అధ్యక్షుడు ప్యాట రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులాల్లో సీట్లు సాధించిన, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. 2014 మే 25న మాలోవత్ పూర్ణ, ఆనంద్ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి జాతీయ జెండాను, ఎస్‌ఆర్ శంకరణ్ చిత్రపటాన్ని, స్వేరో జెండాను ప్రపంచానికి తెలియజేసిన సందర్భంగా ప్రతి ఏడాది మే 25నే స్వేరో విక్టరీ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని రాజు తెలిపారు.

**రఘునాథపల్లి:** మండలంలోని నిడిగొండలో ఆదివారం స్వేరోస్ విక్టరీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ స్వేరో తాళ్లపల్లి వెంకటస్వామి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో గ్రామంలోని కొండపైకి చేరుకొని స్వేరోస్ గీతం ఆలపించారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్, అధికార ప్రతినిధి కుమార్, ఎడ్ల సందీప్, జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్, సుమంత్, అజాద్, తేజ, రామ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకుకు నిప్పంటించి నిరసన



జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

**స్టేషన్‌ఘన్‌పూర్:** పొగాకు పంటను కంపెనీ వారు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో జాతీయ రహదారిపై రైతులు పొగాకుకు నిప్పంటించి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాధిత రైతులు మెరుగు క్రాంతి, నర్సింహులు, సంపత్, సీపీఐ జిల్లా నాయకుడు యాదగిరి మాట్లాడారు. రాఘవాపూర్ గ్రామంలో పొగాకు వ్యాపారులు రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేస్తారని, ఈ క్రమంలో రాఘవాపూర్‌తో పాటు పక్క మండలాలకు చెందిన వివిధ గ్రామాల రైతులు సైతం రాఘవాపూర్‌కు పొగాకుకు తీసుకువచ్చి విక్రయాలు చేస్తారన్నారు. అయితే సదరు వ్యాపారి క్వింటాకు రూ.వెయ్యి నుంచి మూడు వేల లోపు ధర చెప్పడంతో రైతులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది క్వింటాకు రూ.16వేలు ధర పెట్టారని, ప్రస్తుతం ధర మరీ తక్కువగా చెప్పడం దారుణమన్నారు. అందుకే పొగాకుకు నిప్పంటించి నిరసన తెలిపామని, ఆరుగాలం కష్టపడి పండించిన పంట వృథాగా పోతుందని, ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రైతులు తిరుపతి, హన్మంతు, అనిల్, మల్లేష్, దేవయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వవిద్యార్థుల రజతోత్సవ వేడుకలు



జనగామ: వేడుకల్లో పూర్వ విద్యార్థులు



తరిగొప్పుల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**జనగామ:** పట్టణంలోని బీరప్పగడ్డ ఏరియాలోని శ్రీసరస్వతీ స్కూల్‌లో చదువుకున్న 1999–2000 సంవత్సర పూర్వ విద్యార్థులు ఆదివారం రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులు ఒక్కచోట కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మరియాల సత్యనారాయణ, విజయకుమార్ బజాజ్, ప్రస్తుత ప్రిన్సిపాల్ బాలనర్సయ్య హాజరయ్యారు. నాడు పాఠాలు బోధించిన గురువులను శాలువాలతో సత్కరించి పాద నమస్కారాలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. వేడుకల్లో సుంకరి సురేందర్, విష్ణువర్ధన్, మంతెన శ్రీకాంత్, రాంప్రసాద్ మాధవిలత, గోలి రాధికలు పాల్గొన్నారు.

**పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**తరిగొప్పుల:** మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 25 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బానోత్ రవీందర్, హెచ్‌ఎం పూర్వ విద్యార్థులు తాటి శ్రీనివాస్, మాశెటి సందీప్, కొండ్ర లింగస్వామి, కొయ్యడ రాజు తదితరులు పాల్గొన్నారు.

### సీఎం దృష్టికి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

**రఘునాథపల్లి:** భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలు సోమవారం సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య అన్నారు. ఆదివారం నిడిగొండలో భవన నిర్మాణ రంగాల కార్మికుల నూతన కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య, నాయకులు ఇల్లందుల బిక్షపతి, రాజు, రామన్న, రాంనర్సయ్య, ఐలేష్, మైసయ్య, భాస్కర్, ఎడ్ల యాకస్వామి, ప్రకాష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం**

**బచ్చన్నపేట:** కమ్యూనిస్టుల ద్వారానే అన్ని రకాల సమస్యలు పరిష్కరించబడుతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య చందునాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మాజీ ఎంపీటీసీ బండకింది బాల్‌నారాయణ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, బెల్లంకొండ వెంకటేష్, సుంచు విజేందర్, రావుల రవీందర్‌రెడ్డి, నర్సింహులు, బలరాములు, రాజు, ఎల్లయ్య, లక్ష్మి, రాజవ్వ, వెంకటమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

**అనుమతి లేకుండా సహజ వనరులు తరలిస్తే చర్యలు**

**దేవరుప్పుల:** సంబంధిత అధికారుల అనుమతి లేకుండా సహజ వనరులైన మట్టి, ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని దాదాసాహెబ్ కాలనీ ఏరియాలోని ఏనగుట్ట నుంచి మున్‌పహాడ్‌కు చెందిన ఐదు ట్రాక్టర్లలో ఇదే గ్రామ శివారు తాటిపాముల క్రాసింగ్ వద్ద ఓ రైసు మిల్లుకు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. ఈ విషయమై సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకోగా మట్టి లోడుతో ఉన్న రెండు ట్రాక్టర్లతోపాటు మరో మూడు ఖాళీ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య కోసం తహసీల్ అధికారులకు అప్పజెప్పనున్నట్లు ఎస్సై తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**పాలకుర్తి:** గిరిజనుల హక్కుల సాధన కోసం ఖమ్మంలో నిర్వహించనున్న సభ కరపత్రాలను పాలకుర్తిలో సంఘం జాతీయ జనరల్ సెక్రెటరీ నరేందర్ పవార్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వీరేష్ నాయక్, బాలు నాయక్, నాగరాజు,సుందర్, రాములు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే దళితులకు మేలు**

**చిల్పూరు:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే దళితులకు అన్ని విధాలా మేలు జరుగుతోందని.. ఇది ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకురాలు ఉడుగుల భాగ్యలక్ష్మి అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలో ఆదివారం ముఖ్య కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి దళితుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. నాయకులు వెంకట్రాం, ఎడ్ల యాదగిరి, నల్ల ఎల్లయ్య, ఎడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి**

**చిల్పూరు:** రాజవరం గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్ల ఎల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లు సరిపోవడం లేదని, దీంతో పాటు వీధిలైట్లు మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. నాయకులు ఎడ్ల యాదగిరి, జక్కుల రాజయ్య, ఎడ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి**

**చిల్పూరు:** నష్కల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని 30 ఏళ్ల యువకుడు రైలుకింద పడి మృతి చెందినట్లు జనగామ రైల్వే కానిస్టేబుల్ నరేష్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు, మొబైల్ ఫోన్ లేవని అన్నారు. ఒంటిపై నలుపు రంగు జీన్స్‌ప్యాంట్, ఎరుపు రంగు టీషర్టు, పాయింట్ బెల్ట్‌కు లవ్ అనే ఇంగ్లిష్ అక్షరాలు ఉన్నాయని అన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712568523లో సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

**మహాసభలను విజయవంతం చేయండి**

**జఫర్‌గఢ్:** నర్మెట మండల కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో జూన్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.


# సెంట్రల్ ఎక్సైజ్ అధికారిగా సాయికుమార్



సాయికుమార్

**బచ్చన్నపేట:** మండలంలోని ఆలింపూర్ గ్రామానికి చెందిన పత్తి సాయికుమార్ సెంట్రల్ ఎక్సైజ్ అధికారిగా నియామకమయ్యారు. సిద్దిపేట జిల్లా కొడపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన సాయికుమార్ తల్లిదండ్రులు విజయ–దక్షయ్యలు చిన్నతనంలోనే మృతిచెందగా ఆలింపూర్ గ్రామానికి చెందిన మేనమామలు జ్యోతి బైరయ్య, భాస్కర్‌లు పెంచి పెద్దచేసి ఉన్నత చదువులను చదివించారు. సాయికుమార్ చేర్యాలలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో టెన్త్ వరకు, ఇంటర్, బీటెక్‌లు ట్రిపుల్ ఐటీ బాసరలో విద్యనభ్యసించారు. టాటా కన్సల్టెన్సీలో రెండు సంవత్సరాలు ఉద్యోగం చేస్తూ ఎంప్లాయి స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) పరీక్ష రాసి ఉత్తమ ప్రతిభకనబర్చి ఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు లేకున్నా మేనమామల సంరక్షణలో ఉన్నతమైన ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

**బచ్చన్నపేట:** సమస్యల పరిష్కారానికి దళితులంతా సంఘటితం కావాలని ఆ సంఘం నాయకులు గంధమల్ల జంపయ్య, నరేందర్‌లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు మారినా.. రాజ్యాలు, రాజులు మారినా దళితులపై చూపే వివక్ష మాత్రం మారలేదన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే పాలన సాగుతున్నా.. నాయకుల ధోరణిలో మాత్రం మార్పు రావడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు. కుల అధ్యక్షుడిగా కర్రె శ్రావణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని సన్మానించారు. సమావేశంలో అల్వాల నర్సింగారావు, రాజు, రాజశేఖర్, యాదగిరి, పెంటయ్య, భిక్షపతి, దయాకర్, కిష్టయ్య, సంపత్, పరుశరాములు పాల్గొన్నారు.